


# రుచి

ఎస్.ఎస్.మణ్యమ్

1949. కోనసీమలో ఒక పల్లెటూరు అది. ఆ ఊరి పెద్ద కామందు నరసయ్య. ఆయనకి ఏభయిఏళ్ళు. ఏభై ఎకరాల మాగాణి, ఇరవై ఎకరాల కొబ్బరి తోట ఆయన ఆస్తి. కొబ్బరితోటలోనే ఏభయిదాకా మామిడిచెట్లున్నాయి. వాటిలో కొన్ని ఊరగాయ కాయచెట్లు. మిగతావి బంగినపల్లి, చెరకురసాలు, పంచదార కలిశలు, నూజివీడు రసాలు, నీలాలు, కలెక్టరు కాయల చెట్లు!

నరసయ్యగారి ముగ్గురు ఆడపిల్లల్నీ దగ్గర ఊళ్ళ సంబంధాలే చేసారు. ముగ్గురు మొగపిల్లలూ కొత్తపేట స్కూల్లో స్కూల్ఫైనల్ చదివి వ్యవసాయంలో తండ్రికి సాయం చేస్తున్నారు.

వేసంగులకు కూతుళ్ళు, అల్లుళ్ళూ, మనవలు వచ్చేవారు ఆ ఊరికి. అందరికీ ఆవకాయ, మాగాయ, తొక్కుపచ్చళ్ళు నరసయ్యగారి సతీమణి పెట్టేది.

నరసయ్యగారి కమతంలో పనిచేసే పాలేర్లకే కాకుండా, ఊడ్పులు నూర్పుళ్ళు చేసే పనివాళ్ళు అప్పుడప్పుడు అడిగే 'పచ్చడి' పెట్టడానికి సరిపోయేలా ఊరగాయలు పెట్టడం వేసంగులలో పెద్ద కార్యక్రమం ఆ యింట్లో.

మామిడిపళ్ళ కాయలు దోరగ పండే టప్పటికి చెట్లనించి దింపించి కొన్ని యింట్లో మగ్గేసి మిగతావి అందరికీపంచి పెట్టేవారు నరసయ్య.

'నరసయ్యగారి తోటలో మామిడిపళ్ళు చాలా తియ్యగా వుంటాయి' మాలపల్లి నుంచి ఊళ్లో పెద్దవీధి దాకా అందరూ అనేమాటే అది. 'నరసయ్యగారూ మీరీ పళ్ళన్నీ రాజమండ్రి పంపితే డబ్బు వస్తుంది కదండీ. అడిగినవాడికి కాదన కుండా ఎందుకు పంచిపెడ్తారు' అని ఒకరు అంటే,

"మన ఊరివాళ్ళు పరాయివాళ్ళాటండీ. దేముడు దయవల్ల నాకింత వుంది. ఉన్నంతలో కొంత అందరితోనూ కలిసి తింటే అదో పెద్ద త్యాగమా? గాంధీగారు, నెహ్రూగారు, ప్రకాశంపంతులు గారంతటి నాయకులు చేసిన త్యాగాల ముందు మనం చేసేదెంత. ఆ స్థాయికి వీలాగా చేరలేము మనలాటివాళ్ళం" అనేవారు నరసయ్యగారు.

నరసయ్యగారు గాంధీ భక్తులు. ఆ ఊళ్లోనే నేయించిన ఖద్దరుబట్టలు కట్టేవారు. ఆ ఊరు, మాలపల్లిలోని బీద కుటుంబాలలో ఎవరికి పెళ్ళి అయినా పెళ్ళిబట్టలు, తాళి ఖర్చు ఆయనదే.

గణపతి నవరాత్రులు, శ్రీరామ నవమి, పెద్దపండుగ ఉత్సవాలు ఆయన పెద్దరికం లోనే జరిగేవి ఏటా. ప్రభల తీర్థానికి ఆ ఊరి ప్రభని తీసికెళ్ళేటప్పుడు ఒకవైపు నరసయ్యగారు భుజం వెయ్యాల్సిందే.

'కుర్రాడు బాగా చదువుతున్నాడు నాయుడుగా. రాజమండ్రి కాలేజికి పంపించు' అంటే నాయుడిగారి అబ్బాయి ఆర్ట్సు కాలేజిలో చేరాల్సిందే.

నాయుడుగారు కాస్త ఇబ్బందిగా మొహంపెడ్తే 'నాదగ్గర తీసుకోవయ్యా, తర్వాత అబ్బాయి సంపాదించేటప్పుడు తీర్చు వచ్చులే' అని ప్రోత్సహించేవారు.

'దీపంలా వుంది పిల్ల. ఇంకో ఊరు ఇవ్వడం ఎందుకు. పూజారిగారి కొడుక్కి ఇవ్వకూడదా?' అని నరసయ్యగారు అంటే మరో నెలలో ఆ అమ్మాయి పూజారిగారి కోడలయ్యేది. ఆ ఊరి అబ్బాయి ఎవరైనా బి.ఏ.పాసైతే ఆరోజు మిఠాయి పంచి పెట్టేవారు నరసయ్యగారు అందరికీ, 'మనవూరి కుర్రాడు పైకి రావడం మనకి గర్వకారణంకాదా' అంటూ.

అప్పటిలో ఆ పల్లెటూళ్లలో సోషలిజం, కమ్యూనిజం అంతగా తెలీదు ఎవ్వరికీ.

తెలంగాణా రైతు ఉద్యమ ప్రభావం ఆ వూళ్ళలో అంతగా లేదు. గాంధీగారు పోయినా నెహ్రూగారిలో సంపూర్ణ విశ్వాసం వుంచేవారు అప్పటి పల్లెటూళ్లలో ఆరాధించేదీ కోరుకొనేదీ నరసయ్యగారి వంటి పెద్ద కామందులని.

ఆ వేసంగులలో మామిడిపళ్ళ చెట్లని దోరగ పండి దింపుకి సిద్ధంగా వున్నాయి.

ఇంకో వారం రోజులలో కొయ్యడానికి నిర్ణయించారు.

మధ్యాహ్నం నరసయ్యగారు తోటలోనే మడత మంచంమీద పడుక్కొని విశ్రాంతి తీసికొంటున్నారు.

ఇంతలో పెద్ద పాలేరు ఒక పదిహేనేళ్ళ హరిజన బాలుడిని తీసికొని వచ్చాడు.

ఆ పిల్లవాడు నరసయ్యగారి కేసి భయం భయంగా చూస్తున్నాడు.

'ఏమయింది' అన్నట్లు చూసారు నరసయ్య పెద్ద పాలేరుకేసి.

'వీడు బంగినపల్లి కాయలు దొంగ తనంగా కోస్తుంటే పట్టుకొన్నా' అన్నాడు పెద్ద పాలేరు.

'నీ పేరేమిటి' అన్నారు నరసయ్య ఆ కుర్రవాడికేసి చూస్తూ.

'వల్లయ్య అంటారండి' అన్నాడు ఆ పిల్లవాడు తలవంచుకొనే.

'మీ నాన్న పేరేమిటి?'

'పళయ్యండి'

'పళయ్య కొడుకువా. మీ నాన్న ఈ సంవత్సరం ఇంకా చెప్పులజత కుట్టి యివ్వలేదు' అన్నారు నరసయ్య నవ్వుతూ.

'అయ్. మీకనే మాత్తున్నాడండి రెండు దినాలుగా' అన్నాడు నల్లయ్య తల ఎత్తి.

'సరే! దొంగతనం చెయ్యొచ్చా' అని అడిగారు నరసయ్య

నల్లయ్య మాట్లాడకుండా మళ్ళా తల దించుకున్నాడు.

'చెప్పు! దొంగతనం పాపంకాదా' అని మళ్ళీ అన్నారు నరసయ్య.

'పాపమేనండి. కాని ఏం చెయ్యను. నాలుగు దినాలుగా ఇంటికాడ కూడు లేదండి' అన్నాడు నల్లయ్య తల వంచుకొనే.

ఒకనిమిషం నిశ్శబ్దం తాండవించింది ఆ ముగ్గురిమధ్య.

'అవునుగానీ మా ముగ్గురి అబ్బాయిలకీ చెప్పులజతలు వెంటనే చెయ్యమని మీ నాన్నకి చెప్పు అందాకా ఈ ఇరవైరూపాయలు దగ్గర వుంచమను. తర్వాత లెక్కలు చూద్దాంలే' అంటూ లాల్చీ జేబులోంచి రెండు పదిరూపాయల నోట్లు యిచ్చారు నరసయ్య.

నల్లయ్య డబ్బు తీసికొని అలాగే నిలబడ్డాడు.

'నీకు కావాల్సినన్ని మామిడికాయలు కోసుకుపో. కాని ఎప్పుడు దొంగతనం చెయ్యకు అడిగితే ఈ తోటలో ఎవ్వరూ కాదనరు' అన్నారు నరసయ్య.

నల్లయ్య తల ఊపి అక్కడినుంచి వెళ్ళాడు.

'సాయంత్రం యింట్లో రెండు కుంచాల బియ్యం తీసికొని పళయ్య యింట్లో ఇయ్యి' అన్నారు పెద్ద పాలేరుతో నరసయ్యగారు నిద్రకు ఉపక్రమిస్తూ.

ఇంతలో నరసయ్యగారి ఆఖరి కొడుకు వెంకటేశ్వర్లు వచ్చాడు.

'నాన్నా, మామిడికాయలు అందరూ కోసికొని పోతున్నారట. రేపే దింపు తీసేద్దాం' అన్నాడు వెంకటేశ్వర్లు.

'కాయలు దోరగా పండిన తర్వాత కోస్తేనే రుచి. చిలకకొట్టు అవుతున్నాయని చిలకలని గండిపాస్తూ వారం రోజుల తర్వాతే' అని కళ్ళు మూసుకొని పడుక్కొన్నారు

వెంకటేశ్వర్లు విసుగ్గా చూసాడు తండ్రి వైపు.

* * *

1979 వినభయ్యేళ్ళ నరసయ్యగారు తోటలో మూడు రోజులుగా మడత మంచం మీద పడుక్కొని మధ్యాహ్నం విశ్రాంతి తీసికొంటున్నారు.

ఇంతలో నలభయి అయిదేళ్ళ నల్లయ్య వచ్చి కొత్తగా కుట్టిన చెప్పుల జతని మంచం దగ్గర పెట్టాడు వినయంగా.

'ఏమోయ్! విశేషాలేమిటి' అని పలకరించారు నరసయ్య

'ఢిల్లీలో పదవి కోసం నాయకులంతా కీచులాడుకొంటున్నార్ట కదండి' అన్నాడు నల్లయ్య.

'ప్రధానమంత్రి పదవి ఒక్కటే ఉంది. దానిమీద మెడమీద తలకాయ ఉన్న ప్రతి వాడికీ మమకారమే ఏం చేస్తాం' అన్నారు నరసయ్య నవ్వుతూ.

'అమ్మ తిరిగి పాలిస్తుంది అంటారా' అన్నాడు నల్లయ్య ఆశగా.

నరసయ్యగారు మనస్సులో నవ్వుకొన్నారు నల్లయ్య అడిగిన పద్ధతి చూసి.

'అవునుగాని నల్లయ్యా, ఆవిడ నీకు ఏమి మేలు చేసిందిరా' అన్నారు నరసయ్య నవ్వుతూ.

'చేసిందని కాదండి. చేస్తుందని. ఏదో ఆశ లేకపోతే బ్రతకడం ఎలా అండి' అన్నాడు నల్లయ్య.

నరసయ్యగారు నల్లయ్య కేసే చూస్తున్నారు.

'పుట్టినకాడ నుంచి పోలేరమ్మకి మొక్కుతున్నా. మంచి జరిగితే ఆ తల్లి చలవ అనుకొంటా. చెడ్డ జరిగితే అది నా ఖర్మ అనుకొంటా. ఏమయినా పోలేరమ్మ మీద గురి పోలేదు కదండి' అన్నాడు నల్లయ్య.

తర్వాత నల్లయ్యే తల వంచుకొని మెల్లగా అన్నాడు, 'ఈ ఏడాది మీ తోటలో మామిడిపళ్ళు రుచి చూసే అదృష్టం లేదు అయ్యగారూ.'

నరసయ్య మొహంమీద విచారరేఖ తళుక్కున మెరిసి మాయమయింది. ఒక్కసారి గత ముప్ఫయి సంవత్సరాలు కళ ముందుకు వచ్చాయి.

మొదటిసారి నల్లయ్యని చూసిన సంవత్సరం నుంచీ ప్రతీ సంవత్సరం నల్లయ్యకి ఏభయి మామిడిపళ్ళు యివ్వడం రివాజు అయిపోయింది. వాళ్ల నాన్న పోయిన తర్వాత నల్లయ్యే ప్రతీ సంవత్సరం కొత్త చెప్పుల జత కుట్టి తనకి యివ్వడం కూడా రివాజయింది

ఏడాదికేడాది తన చుట్టూ వాతావరణం మారిపోవడం తన కళతోనే చూసాడు.

ఇదివరకు ఊరికి కావల్సిన వస్తువులన్నీ ఏవో కొన్ని తప్ప ఊళ్లోనే చేసేవారు.

సాలీలు బట్టలు నేసేవారు ఆ బట్టలు సరిపోయేవి ఊరివాళ్ళకు. కుమ్మరి కుండలు చేసేవాడు. పెద్ద కుటుంబాలు తప్పితే మిగతావాళ్ళ వంటలకి ఆ కుండలు సరిపోయేవి ఊళ్ళో వున్న మూడు జట్కాలు ప్రక్క ఊళ్ళకి వెళ్ళడానికి సరిపోయే

పండగ పబ్బాల సందర్భాలలో సన్నాయి

## వానపాముల క్షేత్రం

వానపాములు మానవునికి ఎంత ప్రయోగకరమో తెలిసిన ఒక జర్మనీ దేశస్థుడు వానపాములను పెంచుతున్నాడు తొమ్మిది ఎకరాలు విస్తీర్ణం గల యీ క్షేత్రంలో సుమారు రెండున్నరకోట్లు వానపాములుండవచ్చునని అంచనా!

వానపాములు పొలాన్ని చదును చేసినట్లు, యింకెవ్వరూ ఏ రకంగానూ చేయలేరని అంటారీయన. ఇవి సమృద్ధిగా వున్న పొలాల్లో, పాస్పేటు ఎరువులను వాడిన పొలాలకంటే ఎక్కువ పంట దిగుబడి లభిస్తుంది. అంతేకాక యీ పొలాల నుండి లభించే ఆహారం రుచిగాను, ఆరోగ్యకరంగాను వుంటుంది. సహజమైన ఎరువులను తయారు చేయడంలో వాటికి అవే సాటి.

నాలుగేళ్ళ క్రితం ప్రారంభించిన యీ వానపాముల పెంపకం అతనికి బాగా ఆర్థిక లాభాలను సమకూరుస్తున్నది. రైతులతోను, చేపలు పట్టే వారితోనూ అతని వ్యాపారం బాగానే సాగుతున్నది.

జనానికి ఏదో విధంగానో మామూళ్ళు ఇచ్చేవారు.

ఒక విధంగ అందరూ ఒక కుటుంబంగానే వుండేవారు. తేడాలు లేవని కాదు. కాని ఆ తేడాల్లోనే ఒక విధమైన ఐక్యత ఉండేది, ముఖ్యంగా తన ఊరులో.

సగటు మనిషికి కోరికలు చాలా తక్కువ వుండేవి. అవసరాలు కూడ అంతంత మాత్రమే.

స్వాతంత్రియం వచ్చిన పదేళ్ళకి వైద్య సౌకర్యాలు పెరగడం వల్లనేమో దేశ జనాభా పెరిగిపోవడం కన్పడింది.

ఉన్న ఉద్యోగాలు తక్కువవడంవల్ల నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది. కనీసం బి.ఎ. లేకపోతే లాభంలేదు అనే పరిస్థితి వచ్చింది. ఇదివరకు స్కూల్ ఫైనల్‌తోనే ఆపేసే పిల్లలు కాలేజి చదువులకి వెళ్ళడం ప్రారంభమయిపోయింది. డిగ్రీలు వచ్చాక ఉన్న ఊళ్ళో వ్యవసాయం చెయ్యడం ఇష్టంలేక, అవసరంలేక దూర దూర దేశాలకి ఉద్యోగాలకు పోవడంతో సమిష్టి కుటుంబ వ్యవస్థ క్రమక్రమంగా క్షీణింప ప్రారంభించింది. తన కుటుంబమే ఇదివరకులా వేసంగులకు ఏటా అందరూ కలవడం అరుదయిపోయింది, ఏదో శుభకార్యం జరిగినప్పుడు తప్ప.

ఎరువులు, ట్రాక్టర్లు వచ్చి వ్యవసాయం లాభకరం అయింది. కాని ఆ లాభాలు కొందరు భూస్వాముల చేతుల్లోనే వుండిపోయాయి. కూలిరేటు రోజుకి రూపాయి నుంచి ఏడు రూపాయల దాకా పెరిగింది. ముప్ఫయిఏళ్ళక్రితం రూపాయకు వచ్చే సరుకులు ఇప్పుడు ఇరవై రూపాయలు పెట్టినా రాకపోవడం అందరికీ తెలుసు.

'రోజుకి ఏడు రూపాయలు ఇస్తున్నాం. ఇంక వీళ్ళకి వేరే ఎందుకు పెట్టాలి' అని రైతులు అనడం తను విన్నాడు. నెహ్రూగారు బ్రతికున్నంతవరకూ ఏదో మేలు దేశానికి కలుగబోతోంది అనే ఆశ వుండేది.

తర్వాత వచ్చిన నాయకత్వం ప్రజలలో ఆ నమ్మకం కుదర్చలేకపోయింది. ఫలితం ఎవడి బాగు వాడు చూసుకోవడం ప్రారంభించారు. భూసంస్కరణలని ప్రభుత్వం హడావుడి చేస్తుంటే అందరు పెద్ద రైతులు జాగ్రత్తపడి మనిషికి పదిఎకరాలు మాత్రం మిగుల్చుకొని ఎక్కువ వుంటే అమ్మేసి చిన్న చిన్న పరిశ్రమలు పెట్టడమో, వ్యాపారంలోకి దిగడమో చూసాడు తను.

తను భూములని ఏకంగా స్వాధీనం చేసుకోకుండా తగినంత వ్యవధి ఇచ్చినందుకు భూస్వాములు రాజకీయ నాయకులకు ఎంత ముట్టచెప్పారో తను కళ్ళారా చూసాడు.

కోనసీమ నుంచి ఇటు రాజమండ్రికి అటు పశ్చిమ గోదావరికి బ్రిడ్జిలు పడడంతో ఆ ఊళ్ళ నుంచి కూరలు, పళ్ళు, పాలు పట్టణాలకి ఎలా ఎగుమతి ప్రారంభమయిందో తను చూసాడు. ఆ విధంగా వచ్చిన డబ్బుతో స్కూటర్లు, రెఫ్రిజిరేటర్లు, ఇనుప బీరువాలు, టేప్‌రికార్డర్‌లు, నైలాన్ చీరలు, విస్కీ సీసాలు పల్లెటూళ్ళకు దిగుమతి అవ్వడం కూడా తను చూసాడు. సగటు మనిషి అవసరాలు కూడా పెరిగి పోయాయి.

తరవాణి అన్నం ఊరగాయతో భోజనం చేసి పొద్దున్నే స్కూళ్ళకి వెళ్ళేవారు ఇదివరకు.

ఇప్పుడు కాఫీ, టిఫిన్‌లు లేనిదే తెల్లవారదు. పెరట్లో వున్న వేపపుల్ల విరిచి పళ్ళు తోముకొనే వాళ్ళు ఇప్పుడు పట్నం నుంచి తెచ్చుకొనే బ్రష్, టూత్ పేస్ట్‌లు లేకపోతే పళ్ళు తోముకున్నట్లే కాదు.

'యథారాజా తథా ప్రజా' లా ఆఖరికి పంచాయితీ ఎన్నికలు కూడా జీవన్మరణ సమస్యలా తీసికొంటున్నారు. పదవి వుంటే నాలుగు డబ్బులు మిగుల్చుకోవచ్చు. ఏం చేసినా పదవి చేతిలో వుండాలి. అనే అన్ని స్థాయిల నాయకుల ఉద్దేశం, గమ్యం.

ఒకరినొకరు దోచుకునే ఉన్మాదం దేశాన్ని ఆవహించింది. దేశం అన్ని రంగాలలోనూ ప్రగతి సాధిస్తోంది. కాని ఆ ప్రగతి దేశ సాధారణ ప్రజకి అందనివ్వడం లేదు కొందరు.

"మీ అవసరాలని కనీస పరిమితికి తగ్గించండి. గ్రామాలను స్వయం పోషకం చెయ్యండి" అని గాంధీగారు చెప్పిందే తన తరాన్ని ప్రభావితులు చేసింది.

గాంధీ జయంతిని దేశం ఏటా జరుపుతోంది.

కాని గాంధి చెప్పింది దేశం క్రమక్రమంగా మర్చిపోయింది. గ్రామాలన్ని పట్నాలకి 'సప్లయి డిపో'లుగా తయారయ్యాయి. గ్రామాలనించి పట్నాలకి వలస సంవత్సరం సంవత్సరానికి ఎక్కువవుతోంది.

ఒక్కొక్క ఎన్నికకి ఒక్కొక్క కొత్త నినాదం.

ఆ నినాదాలతో ఏదో జరగబోతుంది అన్న ఆశతో అమాయక పీడిత ప్రజ ప్రతీ సారి మోసపోతోంది.


ఇదివరకు బ్రాహ్మణుని కులందృష్ట్యా గౌరవించేవాళ్ళు.

ఇప్పుడు కొత్త బ్రాహ్మణులు అరచేతిలో వైకుంఠం చూపించే రాజకీయ నాయకులు. ముఖ్యంగ పదవులలో వున్న నాయకులు.

దేశం ముందుకుసాగిపోతుంది.

కాని ఎక్కడనుంచి ఎక్కడకు?

బుగ్గరు అబ్బాయిలు మనవళ్లు ఆస్తిని



వంచుకోడంతో అందరూ మామూలు రైతు లయ్యారు.

ఎవరి సంసారలని వాళ్లే వేరే తీర్చి దిద్దుకుంటున్నారు.

తను పెరిగిన వ్యవస్థ తన కళ్లెదుటే తన కుటుంబంలోనే అనవసరం అయిపోయింది.

కొబ్బరితోట వెంకటేశ్వర్లు వాటాకి వచ్చింది.

వాడికి నలుగురు పిల్లలు.

అబ్బాయిలు యిద్దరూ మెడిసన్ చదువుతున్నారు. అమ్మాయిలు యిద్దరూ అమలాపురం కాలేజిలో చదువుతున్నారు. ఆ ఏడాదే 'బ్యాంక్‌లోన్' తీసికొని 'కోల్డ్ స్టోరేజ్' ఆ వూళ్లోనే పెట్టాడు.

చుట్టుప్రక్కల ఊళ్లనుంచి కూరగాయలు, పళ్లు కొని వాటిని ఎగుమతి చేస్తున్నాడు.

# రుచి

ఆ వేసంగులకి మామిడిపళ్ళన్ని తోటల్లోంచి కొని 'కోల్డ్ స్టోరేజ్'లో నిలవచేసాడు.

ధర బాగా వచ్చిన తర్వాత బొంబాయి ఎగుమతిచేసే ప్రయత్నంలో వున్నాడు.

అందుకే ఆ సంవత్సరం నల్లయ్యకి పళ్లు యివ్వడం కుదరలేదు.

'ఏమిటి బాబుగారు, అంత ఆలోచిస్తున్నారు' అన్నాడు నల్లయ్య నవ్వుతూ.

నల్లయ్య మాటలకి ఈ లోకంలోకి వచ్చారు నరసయ్య.

'కాలం మారిపోయింది నల్లయ్య. దేశం ముందుకు సాగిపోతోంది' అన్నారు నరసయ్య.

ఒక నిముషం అయ్యాక నరసయ్యగారే అన్నారు.

'చెప్పలేకే రేపు డబ్బు యిస్తానుకాని ఈ పదిరూపాయలకి మామిడపళ్లు కొని మీ పిల్లలకి పెట్టు.'

డబ్బు తీసికొంటున్న నల్లయ్య కళ్లలో నీరు తిరిగింది. 'కొన్న పళ్లరుచి మీరు అభిమానంతో యిచ్చిన పళ రుచి ఒకటేనా బాబుగారు' అన్నాడు నల్లయ్య రుద్ధకంఠంతో.

దూరంగా స్పీకర్‌లోంచి పాట వినపడుతోంది.

'అందరికోసం ఒక్కడు నిలచి
ఒక్కనికోసం అందరు నిలచి
........................
........................
ఆ రోజెంతో దూరం లేదు నల్లయ్యో
అదిగో చూడు......'

నరసయ్య పేలవంగా నవ్వారు

యద్దనపూడి సులోచనారాణి సీరియల్ కలల కౌగిలి
మార్చి '80 సంచిక నుండి ప్రారంభం!
1/8 డెమ్మీ సైజు 100 పేజీలు వెల: రు.1·50
సంవత్సర చందా రూ.18/- 29-2-'80 లోపు కడితే రూ.15/-లు మాత్రమే!
వివరాలకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతిరోడ్, సికిందరాబాద్-500 003.

ఎంతో నమ్మకమైన బ్యాటరీ
మీ సొమ్ముకు అధిక విలువను ఇస్తుంది



IPS/GENE-7-TL

ఏకైక వ్యాపారస్తులు:
GENELEC LIMITED
మద్రాసు – కోయంబత్తూరు – బెంగళూరు
ఎర్నాకులము – సికింద్రాబాదు
MEMBER G.E.C. GROUP

ఎక్సైడ్ తిరుగుతూంటుంది మిగతావి ఆగిపోయినా